

కేజీబీవీలకు రూ. 2 కోట్లు విడుదల

సంగారెడ్డి అర్బన్, మార్చి 2 : సంగారెడ్డి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల నిర్వహణ, డైట్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేసింది. గతేడాది సెప్టెంబరు నెలకు సంబంధించి రూ.54,96,243, అక్టోబరు నెలకు రూ.28,00,691, నవంబరు నెలకు రూ.54,00,048, డిసెంబరు నెలకు రూ.56,32,311 నిధులు విడుదలయ్యాయి. జిల్లాలోని రెండు మోడల్‌స్కూల్ వసతిగృహాల డైట్‌చార్జీలు.. సెప్టెంబరుకు రూ.2,58,663, అక్టోబరుకు రూ.1,88,633, నవంబరుకు రూ.2,42,430 మంజూరయ్యాయి.

కుర్చీ దక్కేనా.. పదవి నిలిచేనా?

- సంగారెడ్డి బల్దియాలో అవిశ్వాస తీర్మానంపై ఉత్కంఠ
- రేపే సదాశివపేట మున్సిపల్ కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక
- పోటాపోటీగా వ్యూహాలు
- క్యాంపులకు కౌన్సిలర్లు

సంగారెడ్డి టౌన్, మార్చి 2: జిల్లాకేంద్రమైన సంగారెడ్డి బల్దియాలో క్యాంపు రాజకీయాలకు తెర లేచింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం ప్రకటించిన నేపథ్యంలో ఆయా పార్టీల కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లడం ప్రాధాన్యత సంతరించుకున్నది. బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిపై అదే పార్టీకి చెందిన వైస్ చైర్ పర్సన్ శంకరి లతా విజయేందర్‌రెడ్డి, 27వ వార్డు కౌన్సిలర్ నక్క మంజులతనాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలు పోటాపోటీగా విహారయాత్రకు తరలివెళ్లారు. అవిశ్వాస తీర్మానం కోసం ఈ నెల 7న సమావేశం నిర్వహించనున్నారు. ఎలాగైనా చైర్‌పర్సన్‌ను గద్దె దించాలన్న ఉద్దేశంతో వైస్ చైర్‌పర్సన్, 27వ వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్లు మూడు రోజుల క్రితమే విహారయాత్రకు తరలివెళ్లారు. మరోవైపు అవిశ్వాసం నుంచి గట్టేందుకు చైర్‌పర్సన్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్లు శనివారం విహారయాత్రకు తరలివెళ్లారు. అవిశ్వాస సమావేశానికి మెజార్టీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యేలా చూసి అవిశ్వాసం వీగిపోయేలా చేయాలని చైర్‌పర్సన్ వ్యూహం అమలు చేస్తున్నారు.



బలాబలాలు ఇలా..

సంగారెడ్డి గ్రేడ్‌వన్ మున్సిపాలిటీలో ప్రస్తుతం 37 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో బీఆర్ఎస్‌కు చెందినవారు 18 మంది, కాంగ్రెస్ తరఫున 11 మంది, బీజేపీ నుంచి 3, ఎంఐఎం తరఫున ఇద్దరు, స్వతంత్రులు ముగ్గురు గెలిచారు. అప్పట్లో ముగ్గురు స్వతంత్ర కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరగా, బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరారు. చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం నోటీసుపై 24 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. ఇందులో ఇప్పటికే నలుగురు కౌన్సిలర్లు వెనక్కితగ్గారు. వైస్ చైర్‌పర్సన్ లతావిజయేందర్‌రెడ్డి, 27వ వార్డు కౌన్సిలర్ నక్క మంజులతనాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో మూడురోజుల క్రితం 12 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు విహారయాత్రకు వెళ్లారు. ఈ నెల 7న జరిగే అవిశ్వాస తీర్మానం సమావేశంలో నెగ్గాలంటే 26 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరముంటుంది. సమావేశానికి మెజార్టీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యేలా చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి 20 మంది కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు. చైర్‌పర్సన్ క్యాంపులో కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 20 మంది కౌన్సిలర్లు వెళ్లినట్లు తెలిసింది.

సదాశివపేటలో బీఆర్ఎస్ చీలిక వర్గానికే బలం

సదాశివపేట, మార్చి 2 : సదాశివపేట బల్దియాలో చైర్‌పర్సన్ ఎన్నిక ఈ నెల 4వ తేదీన జరగనున్నది. చైర్‌పర్సన్ సీటును ఆశిస్తున్న బీఆర్ఎస్ అసమ్మతి నేత మెజార్టీ కౌన్సిలర్లతో క్యాంపు రాజకీయం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాలకొల్లు, భీమవరం, రాజమండ్రి, పోలవరం, పాపికొండల్లో వారి క్యాంపు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. 26 మంది కౌన్సిలర్లు ఉన్న బల్దియాలో 15 మంది కౌన్సిలర్లతో కూడిన బృందం బీఆర్ఎస్ అసమ్మతి నాయకుడి వెంట క్యాంపునకు తరలివెళ్లారు. చైర్‌పర్సన్ ఎన్నిక కోసం 4వ తేదీన బల్దియాలో నిర్వహించే ప్రత్యేక సమావేశానికి వారు నేరుగా హాజరవుతారని సమాచారం. చైర్‌పర్సన్ ఎన్నికలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కూడా బీఆర్ఎస్ అసమ్మతి నాయకుడికే మద్దతిచ్చే అవకాశం ఉన్నది. విహారయాత్రకు వెళ్లకుండా ఉన్న బీజేపీ కౌన్సిలర్, ఎంఐఎం కౌన్సిలర్, స్వతంత్ర కౌన్సిలర్లు కూడా బీఆర్ఎస్ అసమ్మతి నాయకుడికి మద్దతిచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తున్నది. అవసరమైతే చైర్‌పర్సన్ ఎన్నికలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సైతం ఓటు వేయనున్నట్లు సమాచారం. ఇదే జరిగితే 19 ఓట్లతో బీఆర్ఎస్ అసమ్మతి నాయకుడి సతీమణి చైర్‌పర్సన్ పీఠంపై కూర్చునే ఆవకాశమున్నది. అయితే, రాష్ట్ర కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు డైరెక్షన్‌లో బీఆర్ఎస్ అసమ్మతి నాయకుడు అవిశ్వాస రాజకీయాలను నడుపుతున్నట్లు చర్చ జరుగుతున్నది. మైనంపల్లి సదాశివపేట రాజకీయాల్లో తలదూర్చడం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్వాగతించడం లేదని సమాచారం. చైర్‌పర్సన్ ఎన్నికకు ముందే కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన 9 మంది కౌన్సిలర్లకు కాంగ్రెస్ విప్ జారీ చేస్తుందని ఆ పార్టీ కౌన్సిలర్లు కొందరు చెబుతున్న నేపథ్యంలో బల్దియా రాజకీయాలు మరింత రసవత్తరంగా మారాయి. సదాశివపేట బల్దియా పీఠంపై ఎవరు కూర్చున్నా అధికార కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం కనిపిస్తున్నది.



హైవే 161.. జాతికి అంకితం

- సంగారెడ్డి-మదీనాగుడా హైవే విస్తరణ
- మెదక్- ఎల్లారెడ్డి రోడ్డు వెడల్పు
- పటాన్‌చెరు సభలో శ్రీకారం చుట్టనున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 2 : హైదరాబాద్-ముంబై 65వ నంబర్ హైవేపై మామిడిపల్లి నుంచి అకోలా వరకు నిర్మించిన 161 నంబరు హైవేను ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ నెల 5వ తేదీన సంగారెడ్డి జిల్లాకు రానున్న మోదీ పలు రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. విజయ సంకల్పయత్రలో భాగంగా పటాన్‌చెరు మండలం పటేల్‌గూడ వద్ద ఈ నెల 5న జరగనున్న బహిరంగసభలో పాల్గొననున్న ఆయన అక్కడే ఆయా పనులను ప్రారంభించనున్నారు. రూ.1,409 కోట్ల వ్యయంతో నిర్మించిన మామిడిపల్లి జంక్షన్ నుంచి అకోలా 161 నంబరు హైవేపై రాంసానిపల్లి వరకు నిర్మించిన రహదారిని ఆయన ప్రారంభించనున్నారు. అలాగే సంగారెడ్డి క్రాస్ రోడ్డు నుంచి మదీనాగూడ వరకు ఉన్న 46 కిలోమీటర్ల 65వ నంబరు హైదరాబాద్-ముంబై హైవే విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. నిత్యం ట్రాఫిక్ రద్దీతో సతమతమయ్యే ఈ హైవేను ఆరు వరుసలుగా విస్తరించేందుకు కేంద్రం రూ.1,298 కోట్ల అంచనాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ హైవే విస్తరణలో భాగంగా సర్వీస్ రోడ్డుతో పాటు తొమ్మిది ప్రాంతాల్లో వెహికిల్ అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లను నిర్మించనున్నారు. సంగారెడ్డి చౌరస్తా, కంది చౌరస్తా, ఐఐటీహెచ్ సమపంలో, రుద్రారం సమీపంలో, లక్డారం, ఇస్నాపూర్ చౌరస్తాల్లో ఫ్లైఓవర్లను నిర్మించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

మెదక్-ఎల్లారెడ్డి హైవేకు శంకుస్థాపన

ఇక మెదక్ నుంచి ఎల్లారెడ్డి వరకు 43.91 కిలోమీటర్ల 765-డి నంబరు హైవే పనులకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు రూ.500 కోట్ల అంచనాలతో కూడిన ఈ పనులకు కేంద్రం ఆమోదం తెలిపింది. మెదక్ శివారులోని ఎల్లమ్మగుడి వద్ద నుంచి హవేళీఘన్‌పూర్ మీదుగా ఎల్లారెడ్డి వరకు ఈ హైవే పనులు చేపట్టనున్నారు. హైవే పనుల కోసం జాతీయ రహదారుల ప్రాజెక్టు అధికారులు సర్వే కూడా పూర్తిచేశారు.

ప్రధాని సభ ఏర్పాట్లపై సమావేశం

పటాన్‌చెరు, మార్చి 2 : ప్రధాని మోదీ పర్యటన, బహిరంగ సభపై ఉన్నతస్థాయి అధికారులు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల ఐదో తేదీన ప్రధాని సభ జరగనున్న ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలలో భద్రతా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు ఎస్‌ఎస్‌జీ రక్షణ అధికారులు సమావేశమయ్యారు. రాష్ట్రంలోని పలు జాతీయ రహదారుల విస్తరణ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ సభా ప్రాంగణం నుంచి వర్చువల్‌గా ప్రారంభించబోతున్నారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయసంకల్ప సభలో ప్రసంగిస్తారు. సభకు మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి లక్ష మందిని సమీకరించడానికి బీజేపీ నాయకులు కసరత్తు ప్రారంభించారు. ఈమేరకు శనివారం బీజేపీ జాతీయ కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఈటెలరాజేందర్, రఘునందన్ రావు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ బసవలక్ష్మీనరసయ్య, ఎండల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి సభా ప్రాంగణం వద్ద సన్నాహక సమావేశం నిర్వహించారు.

నిన్ననే చేరిక.. నేడు టికెట్!

- జహీరాబాద్ బీజేపీ టికెట్ పాటిల్‌కే!
- ప్రకటించిన అధిష్ఠానం
- అసంతృప్తిలో పలువురు నేతలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 2: బీజేపీలో ఈనెల 1న చేరిన జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌కు టికెట్ ఖరారు చేస్తూ ఆ పార్టీ అధిష్ఠానం శనివారం సాయంత్రం ప్రకటించింది. బీఆర్ఎస్ ద్వారా 2014లో క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చిన బీబీ పాటిల్ అదేయేడు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లోనూ ఆయన జహీరాబాద్ నుంచే బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించారు. రెండోసారి గెలుపొందినప్పటి నుంచి బీబీ పాటిల్ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సన్నిహితంగా మెలిగారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆయనకే జహీరాబాద్ బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ నాయకత్వం నిర్ణయించింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తే గెలిచే అవకాశాలు లేవని ఆయన భావించారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో రెండింటిలోనే బీఆర్ఎస్ గెలువడం ఆయన పార్టీ మారడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. టికెట్ హామీ తోనే శుక్రవారం బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరిన పాటిల్‌కు శనివారం తన సిట్టింగ్ స్థానానికి ఆ పార్టీ టికెట్ ఖరారు చేయడం గమనార్హం. ఇలా ఉండగా నిన్ననే చేరిన పాటిల్‌కు టికెట్ ఇవ్వడం పట్ల బీజేపీ శ్రేణులు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నియోజకవర్గ బీజేపీ టికెట్ కోసం కేంద్ర మాజీ మంత్రి, దివంగత ఎ.నరేంద్ర కుమారుడు ఆలే భాస్కర్, పార్టీ నాయకులు ఎం.జైపాల్‌రెడ్డి, పైడి ఎల్లారెడ్డి, వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి తదితరులు తమవంతు ప్రయత్నించారు. పార్టీ కోసం కొన్నేళ్లుగా కష్టపడి పని చేస్తున్న తమకు టికెట్ రాకపోవడంపై వారు నిరాశ చెందుతున్నారు. ఎం.జైపాల్‌రెడ్డి అనుచరులైతే జహీరాబాద్ నుంచి నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు.



ఏఆర్‌టీ సెంటర్‌లో పరస్పర ఫిర్యాదులు

ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జేడీ, ఏపీడీల విచారణ



సంగారెడ్డి అర్బన్, మార్చి 2 : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్, వైద్య సిబ్బంది పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఓ మెడికల్ ఆఫీసర్ విధులకు సక్రమంగా రావడంలేదని.. మరో మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఏఆర్‌టీ సిబ్బంది ఆస్పత్రి సూపరింటెండెంట్, స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ అధికారులకు తరచూ ఫిర్యాదులు చేశారు. నాపై ఫిర్యాదు చేస్తారా అంటూ సదరు మెడికల్ ఆఫీసర్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉన్నతాధికారులకు ప్రతి ఫిర్యాదులు చేశారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటుండడంతో స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ కరుణశ్రీ, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ శనివారం సంగారెడ్డి జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ సెంటర్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. ఏఆర్‌టీ సెంటర్‌లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బందితో విడివిడిగా మాట్లాడి, లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. ఏఆర్‌టీ సెంటర్‌లో నిత్యం జరుగుతున్న పరిణామాలపై ఆరా తీశారు. ఈ వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

వంద శాతం పోలింగే లక్ష్యం

- మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ఓటరు సంకల్ప పత్రాలను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

మెదక్ అర్బన్, మార్చి 2: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. తన ఛాంబర్‌లో శనివారం ఆయన తెలంగాణ ఓటరు సంకల్ప పత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటరు సంకల్ప పత్రాలను రూపొందించామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు ఓటరు సంకల్ప పత్రాలను అందజేసి వారి తల్లిదండ్రులతో చదివించి సంతకంతో తిరిగి హెచ్‌ఎంలకు అందించే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి మెదక్ జిల్లాలో విద్యార్థి హామీపత్రాలు రూపొందించి అందజేయడం ద్వారా మెరుగైన పోలింగ్ శాతం నమోదైందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఓటరు సంకల్పపత్రాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారని తెలియజేశారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

నేడే పల్స్ పోలియో కార్యక్రమం

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- ఐదేళ్ల లోపు పిల్లలకు చుక్కల మందు పంపిణీ
- సంగారెడ్డి జిల్లాలో 1,86,190 మంది, మెదక్‌లో 73,433 మంది చిన్నారులు

7లో



స్కీముల పేరిట భారీ మోసం

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

7లో

ఏడుపాయల జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- మెదక్ అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు



జాతర ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు

పాపన్నపేట, మార్చి 2: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గామాత ఆలయం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మెదక్ అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు అధికారులకు ఆదేశించారు. ఈ నెల 8 నుంచి 10 వరకు జాతర జరగనున్న నేపథ్యంలో శనివారం ఏడుపాయల ఆలయ సమీపంలోని హరిత హోటల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, బారికేడ్లు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గతంలోని అనుభవాలను దృష్టిలో పెట్టుకుని లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జల్లు స్నానాలు, తాగునీటి కుళాయిలు, శౌచాలయాలను త్వరగా ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల దర్శనార్థం క్యూ ఏర్పాటు చేయాలని సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు తెలిపారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమాదేవి, డీపీవో యాదయ్య, పీఆర్ ఈఈ నర్సింహులు, నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ రాజేశ్వర్, ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల సహకారం అవసరం: డీఎస్పీ

ఏడుపాయల జాతరను విజయవంతం చేసేందుకు నాగసాన్‌పల్లి గ్రామస్థుల సహకారం ఎంతో అవసరమని మెదక్ డీఎస్పీ డాక్టర్ డీ.రమేష్ అన్నారు. శనివారం సాయంత్రం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో డీఎస్పీ ప్రజలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడుపాయల జాతరకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్నందున గ్రామస్థుల సహకారం అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో మెదక్ రూరల్ సీఐ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 2: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గామాత జాతరకు ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు మెదక్ రీజియన్ నుంచి 167 బస్సులు నడపనున్నారు. మెదక్, జోగిపేట, సంగారెడ్డి, నర్సాపూర్, బాలానగర్, సదాశివపేట, నారాయణఖేడ్, జహీరాబాద్, ఝరాసంగం, శంకరంపేట, బోడ్మట్‌పల్లి, శంకర్‌పల్లి, జేబీఎస్ తదితర ప్రాంతాల నుంచి బస్సులు ప్రారంభంకానున్నాయి. ఇవేకాకుండా జహీరాబాద్ నుంచి ఝరాసంగానికి ఆరు బస్సులు, శంకర్‌పేట నుంచి కొప్పోల్‌కు 4 బస్సులు, సిద్దిపేట నుంచి వేములవాడకు రెగ్యులర్ సర్వీసులతోపాటు అదనంగా మూడు బస్సులు నడపనున్నారు. సాధారణ చార్జీలే వసూలు చేయనున్నారు. వివరాలకు మెదక్ డిపో మేనేజర్ 9959226268, సంగారెడ్డి డీఎం 9959226267, సిద్దిపేట డీఎం 9959226271, జహీరాబాద్ డీఎం 9959226269, నారాయణఖేడ్ డీఎం 9959223170, గజ్వేల్ డీఎం 9959226270 నంబర్లను సంప్రదించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు.

నిద్రావస్థలో నిఘా నేత్రాలు

- చాలా చోట్ల పనిచేయని వైనం
- జనసంచార ప్రాంతాల్లో ఇదే పరిస్థితి
- దొంగతనాల విచారణకు ఆటంకం



చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో నేలను చూస్తున్న సీసీ కెమెరా



సిద్దిపేటలోని శ్రీనగర్‌కాలనీలో తిరుగుముఖం వేసిన సీసీ కెమెరా



[redacted] నర్సాయపల్లిలో పనిచేయని కెమెరా

హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద అమర్చిన సీసీ కెమెరాలు కొద్దిరోజులుగా పనిచేయడం లేదు. ఇటీవల పట్టణంలో దొంగల బెడద ఎక్కువైంది. దొంగలను పట్టుకోవడానికి సహకరించాల్సిన సీసీ కెమెరాలు నిద్రావస్థలో వెక్కిరిస్తున్నాయి.

నారాయణరావుపేట మండలంలోని 10 గ్రామాల్లో సీసీ కెమెరాలను ఆర్భాటంగా ఏర్పాటు చేశారు. కానీ, 90శాతం కెమెరాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగేలా ఈ కెమెరాలను కిందకి వంచడం, ధ్వంసం చేయడం జరిగింది.

కేవలం హుస్నాబాద్, నారాయణరావుపేట ప్రాంతాల్లోనే కాదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 2 : ప్రతీ కదలికను పర్యవేక్షించాల్సిన సీసీ కెమెరాలు నిద్రావస్థలో చేరాయి. జిల్లాలోని 499 గ్రామాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లుగా అప్పట్లో ప్రకటించారు. కానీ ఇందులో అక్కడక్కడ మినహా పనిచేయడం లేనట్లుగా స్పష్టమవుతోంది.

దొంగతనాలకు ఆస్కారం

జిల్లాలో ఇటీవల దొంగల బెడద ఎక్కువైంది. పట్టపగలే ఇండ్లు, దుకాణాల తాళాలు పగలగొట్టి నగదు, ఆభరణాలను అపహరిస్తున్న ఉదంతాలు వెలుగుచూస్తున్నాయి. అయితే దొంగలను పట్టుకోవడంలో మాత్రం జాప్యం జరుగుతోంది. ఇందుకు సీసీ కెమెరాలు నిరూపయోగంగా మారడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. సీసీ కెమెరాల నిర్వహణ సక్రమంగా ఉంటే దొంగతనాలు చేయడానికి సైతం తర్జనభర్జన పడే పరిస్థితి ఉండేది. కానీ యథేచ్ఛగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. జిల్లాలోని చాలాచోట్ల ఇటీవల దొంగతనాలు జరగడమే ఇందుకు నిదర్శనం. ప్రధాన రహదారులపై మినహాయిస్తే గ్రామాలు, పట్టణాలు, వార్డుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు స్తంభాలపై వెక్కిరిస్తున్నాయనే చెప్పాలి. ఇక ఇసుక అక్రమ రవాణా జరిగే ప్రాంతాల్లోనైతే సీసీ కెమెరాల కంటపడకుండా ధ్వంసం చేస్తున్నట్లు తెలుస్తోంది.

సీపీ మేడమ్ దృష్టిసారిస్తేనే..

జిల్లా నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనురాధ తనదైన ముద్ర వేస్తున్నారు. అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపుతూ అక్రమార్కులకు సవాల్ విసురుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలోనూ అన్ని కోణాల్లో పర్యవేక్షిస్తున్నారు. అయితే సీసీ కెమెరాల నిర్వహణపై ఆమె ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించడం, కొత్త కెమెరాలను ఏర్పాటు చేయడంలో చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో ఏర్పాటు చేసినట్లుగానే దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతోనైనా క్షేత్రస్థాయిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పశుసంవర్ధక శాఖ
ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

మెదక్ అర్బన్, మార్చి 2: పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక టీఎన్జీవో భవనంలో, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోపాల్, కార్యదర్శిగా లింగమూర్తి, సహాధ్యక్షుడిగా హరిశంకర్, కోశాధికారిగా రాకేష్, ఉపాధ్యక్షులుగా సుదర్శన్ పాని, వీరారెడ్డి, రాజ్‌కుమార్, మంజుల, కార్యదర్శులుగా విశ్వనాథం, చెన్నయ్య, కిషోర్‌కుమార్, భాగ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా గట్టయ్యతోపాటు పలువురు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఫజులొద్దీన్, సంయుక్త కార్యదర్శి శివాజీ, సల్లావొద్దీన్, పశుసంవర్ధకశాఖ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రతన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కంది, మార్చి 2 : మండలకేంద్రమైన కందిలోని లక్ష్మీనగర్ కాలనీలో 13వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శ్రీరామ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు, కార్యదర్శి విద్యాధర్ గౌడ్, బిల్ కలెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

● **పుల్‌కల్:** మండలంలోని కోడూరు గ్రామంలో సీసీ రోడ్డు పనులను డీసీసీబీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంసాని రామచంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **సదాశివపేట:** మండలంలోని అరూర్ గ్రామంలో రూ.15 లక్షల నిధులతో కొత్తగా నిర్మించే సీసీరోడ్డు పనులను శనివారం తాజా మాజీ సర్పంచ్ నాయికోటి మధు ప్రారంభించారు.

తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద
డుకాటి బైక్ క్లబ్ సభ్యుల సందడి

తూప్రాన్, మార్చి 2: రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, డుకాటి క్లబ్ సభ్యులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. శనివారం తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. మనోహరాబాద్ పాఠశాల విద్యార్థులకు రోడ్డుభద్రతపై పోటీలు నిర్వహించారు. తూప్రాన్ ఎంజేపీ బాలికల విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ హైవే ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ, వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రతినిధులు కోడే భారతి, శ్రీనివాస్, పోచాలు తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- నేడే పల్స్ పోలియో కార్యక్రమం, ఏర్పాట్లు పూర్తి
- 0-5 ఏళ్లలోపు పిల్లలకు చుక్కల మందు పంపిణీ
- సంగారెడ్డి జిల్లాలో 1,86,190 మంది, మెదక్‌లో 73,433 మంది, సిద్దిపేటలో 93,667 మంది పిల్లలు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, మార్చి 2: పిల్లల్లో వైకల్య సమస్య రాకుండా, వారి ఆరోగ్య సంరక్షణకు ఏటా వైద్య ఆరోగ్యశాఖ పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కల మందును వేస్తారు. ఈ నెల 3న నిర్వహించే కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. జోగిపేట ఏరియా ఆస్పత్రిలో నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, బూత్‌లల్లో చుక్కల మందు పంపిణీ చేస్తారు. మొదటిరోజు బూత్‌స్థాయిలో, రెండు, మూడురోజుల్లో ఇంటింటికి తిరిగి వ్యాక్సిన్లను వేస్తారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తారు.

సంగారెడ్డి జిల్లాలో 1,86,190 మంది

జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 1,86,190 మంది ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా వాటి పరిధిలో 17,86,422 జనాభా ఉన్నది. నివాస గృహాలు 3,55,775 బూత్‌ల సంఖ్య 1137, రూట్లు 38, రూట్ సూపర్‌వైజర్లు 114, మొబైల్ బృందాలు 38, వ్యాక్సినేటర్లు 4548 మందిని నియమించారు. పోలియో రహిత సమాజం కోసం ఐదేళ్లలోపు పిల్లలందరికీ చుక్కల మందు వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.శశాంక్‌దేశ్‌పాండే కోరారు.

మెదక్ జిల్లాలో 73,433 మంది చిన్నారులు

మెదక్ జిల్లావ్యాప్తంగా 457 బూత్‌ల్లో ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కల మందు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో గుర్తించిన 1,74,534 ఇళ్లకు తిరిగి 73,433 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకోసం 1046 బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డా.చందునాయక్ కోరారు.





సంగారెడ్డిలోని ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో బ్యానర్, పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం(ఫైల్)

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి: సిద్దిపేట కలెక్టర్

సిద్దిపేట టౌన్, మార్చి 2: ఈ నెల 3, 4, 5న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. శనివారం సిద్దిపేటలోని కలెక్టరేట్ కార్యాలయంలో పోలియో కార్యక్రమంపై వైద్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు పల్స్ పోలియోకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సిద్దిపేట జిల్లాలోని 2,96,352 గృహలను సందర్శించి, 93,667 మంది 0-5 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలను అందించాలని ఆదేశించారు. దీనికిగాను 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో, 194 ఉప కేంద్రాల పరిధిలో 586 బూతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 306 హై రిస్క్ ప్రాంతాలుగా గుర్తించిన వాటిపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సిద్దిపేట బస్టాండ్‌లో-2, రైల్వేస్టేషన్-1, జగదేవ్‌పూర్-1, రాయపోల్-1, సింగన్నగూడెం-1, గజ్వేల్-3, తీగుల్-1, వర్గల్-2, కోహెడ-1, హుస్నాబాద్-2, చేర్యాల పట్టణం-2, దుబ్బాక పట్టణం-1, కొమరవెల్లి జాతర ప్రాంతాల్లో-3 మొత్తంగా 21 బూత్‌లను ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న పిల్లలను, జాతరలో పాల్గొనే పిల్లలకు రెండు చుక్కలను వేయాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ విజయరాణి, డాక్టర్ రజిని, డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ కిషోర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.



సిద్దిపేటలోని కలెక్టరేట్‌లో పల్స్ పోలియో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, డీఎంఅండ్‌హెచ్‌వో కాశీనాథ్

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

రాయపోల్, మార్చి 2: వరకట్న వేధింపులకు గురై ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి, ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన చింతకింది ఎల్లం కూతురు రేఖ(23)ను ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మరదగల్ల బాబుకు ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం చేశారు. పెళ్లి సమయంలో కట్నం కింద బైక్, ఇంటి సామాన్లు, పావు తులం బంగారం ఇచ్చారు. మరో మూడు తులాల బంగారం ఇవ్వాల్సి ఉన్నది. కొంతకాలం వీరి కాపురం సజావుగానే సాగింది. కొన్నినెలల నుంచి రేఖను అత్తింటి వారు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో రెండుసార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 29న ఓ శుభకార్యం నిమిత్తం రేఖ ముబారస్‌పూర్‌లోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. శుక్రవారం సాయంత్రం రేఖను తన సోదరుడు ఉప్పరపల్లిలో దింపి వచ్చాడు. శనివారం తెల్లారేసరికి రేఖ అత్తవారింటిలో ఉరేసుకుని మృతిచెందింది. భర్త బాబు, మామ చంద్రయ్య, అత్త రాజమణి, ఆడపడుచు భాగ్యలక్ష్మి కలిసి రేఖను వరకట్న వేధింపులకు గురిచేయడంతో ఆత్మహత్య చేసుకున్నదని మృతురాలి తండ్రి చింతకింది ఎల్లం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపారు. కాగా మృతురాలికి ఏడాదిన్నరలోపు కుమారుడు ఉన్నారు.



రేఖ(ఫైల్)

కుంటలో పడి ఒకరి మృతి

కౌడిపల్లి, మార్చి 2: రెండురోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కుంటలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని శేరితండాలో శనివారం వెలుగులోకి వచ్చింది. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన అజ్మీర రమేష్(29) గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అనంతరం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా తండా సమీపంలోని రత్నం కుంటలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నదనే సమాచారం తెలుసుకుని, కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి చూసి మృతుడు రమేష్ అని గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డికి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

చేగుంట, మార్చి 2: మద్యానికి బానిసై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండలం కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కేశవగౌడ్(29) చేగుంటలో అద్దె గదిలో ఉంటూ, ఓ పరిశ్రమలో కూలి పనులు చేస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటున్నాడు. దీంతో కుటుంబ పోషణ భారమై మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ తెలిపారు.



మృతిచెందిన కేశవ్ గౌడ్

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరి మృతి

టేక్మాల్, మార్చి 2: ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన టేక్మాల్ మండలంలో చోటు చేసుకున్నది. టేక్మాల్‌కు చెందిన తలారి శివకుమారు(35) శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై టేక్మాల్ నుంచి ఎల్లాపూర్ వైపు వెళ్తుండగా, ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శివకుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. శనివారం ఉదయం గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకుని కుటుంబసభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా, డ్రైవర్ మృతి

సదాశివపేట, మార్చి 2: ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన సదాశివపేట పట్టణంలోని సిద్ధాపూర్ రోడ్డుపై శనివారం చోటుచేసుకున్నది. పట్టణంలోని 6వ వార్డు సిద్ధాపూర్ కాలనీకి చెందిన ముస్తఫా(30) ఆటోడ్రైవర్. శనివారం సాయంత్రం అతడు ఆటోతో సిద్ధాపూర్ కాలనీ నుంచి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్తున్నాడు. సిద్ధాపూర్ రోడ్డులో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఎర్రకుంటలో బోల్తాపడింది. తీవ్రగాయాలైన ముస్తఫాను 108లో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మృతి చెందిన ముస్తఫా

గొంతు కోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం

సిద్దిపేట క్రైం, మార్చి 2: సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పూరకు చెందిన మండల రాజు అనే యువకుడు పాత కూరగాయల మార్కెట్‌లో శనివారం సాయంత్రం గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రాజును ప్రథమ చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాజు ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను పోలీసులు తెలుసుకుంటున్నారు. ప్రేమ వ్యవహారమే కారణమని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తున్నది.

చోరీ కేసులో పాత నేరస్థుడి అరెస్టు

తూప్రాన్, మార్చి 2: మెదక్, సిద్దిపేట జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిని ఓ కేసులో శనివారం అరెస్టు చేసినట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు. మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామానికి చెందిన చిన్నమట్టెల భాస్కర్(25) తూప్రాన్, వెల్దుర్తి, చేగుంట, దౌల్తాబాద్ మండలాల్లో గతంలో చోరీలకు పాల్పడి నిందితుడిగా ఉన్నట్లు వివరించారు. తూప్రాన్ పట్టణానికి చెందిన దుర్గం నగేష్ వాహన బ్యాటరీని అతడు మూడురోజుల క్రితం చోరీ చేశాడు. శనివారం అనుమానాస్పదంగా తిరుగుతున్న భాస్కర్‌ను పట్టుకుని బ్యాటరీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

చెరకు తోట దగ్ధం

ఝరాసంగం, మార్చి 2: చెరకు తోటకు నిప్పంటుకుని దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ఏల్గోయి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన మాణేన్న అనే రైతు రెండు ఎకరాలల్లో చెరకు పంటను సాగుచేశాడు. ప్రమాదవశాత్తు అర ఎకరా చెరకు పంటకు నిప్పంటుకున్నది. అదేవిధంగా డ్రిప్ పైపులు కూడా దగ్ధమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

సెల్ఫీ వీడియో తీసి.. యువకుడి అదృశ్యం

తూప్రాన్, మార్చి 2: కోర్టు కేసు విషయంలో భయాందోళనకు గురైన యువకుడు సెల్ఫీ వీడియో తీసి కనిపించకుండాపోయాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలో చోటు చేసుకున్నది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన రాజ్యం లక్ష్మి కొంతకాలంగా తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి వద్ద ఇద్దరు కుమారులతో కలిసి నివాసముంటున్నది. చిన్న కుమారుడు రాజ్యం గణేష్(24) గతనెల 29న ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రివరకూ రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా పెద్ద కొడుకు రాజ్యం మహేష్ రాత్రి ఇంటికి రాగా గణేష్ ఫోన్ కనిపించింది. ఫోన్‌ను చార్జింగ్ పెట్టి చూడగా.. సెల్ఫీ వీడియోలు కనిపించాయి. గతంలో లక్ష్మి అత్త దుర్గమ్మ, తోటి కోడలు పద్మ గణేష్‌పై కేసు పెట్టారు. కోర్టులో కేసు ఇయరింగ్ ఉండడం, మళ్లీ దుర్గమ్మ గణేష్‌పై శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో తిట్టినట్లుగా ఫిర్యాదు చేసింది. వీటి విషయంలో ఆత్మహత్య ఆత్మహత్య చేసుకుంటానంటూ గణేష్ సెల్ఫీ వీడియోలో పేర్కొన్నట్లు వివరించారు. గణేష్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు తూప్రాన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ పరిధిలో చైర్మన్ ఆకస్మిక తనిఖీ

నారాయణఖేడ్, మార్చి 2: ఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ శనివారం తెల్లవారుజామున 4 నుంచి 8 గంటల వరకు మున్సిపల్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రధాన చౌక్‌ల వద్ద పారిశుధ్య పనులు, రోడ్లు ఊడ్చే పనులు, ఇంటింటికి తిరిగి ఆటోల్లో చెత్త సేకరణ, తడి, పొడి చెత్తల సేకరణ తీరును పరిశీలించారు. తాగునీటి సరఫరా గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలమైనందున తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు.



ఖేడ్ రాజీవ్ చౌక్ వద్ద పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఆనంద్ స్వరూప్ షెట్కార్

మండుటెండల్లో మల్లన్న భక్తుల ఇక్కట్లు

- రాజీవ్ రహదారి పక్కన నిలువనీడ కరువు
- బస్‌షెల్టర్ ఏర్పాటుచేయాలని వేడుకోలు

చేర్యాల, మార్చి 2: కొమురవెల్లి మల్లన్న భక్తులు మండుటెండల్లో ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్ రహదారి పక్కన నిలువనీడ సౌకర్యం కల్పించకపోవడంతో నానాతంటాలు పడుతున్నారు. మల్లన్న ఆలయానికి రాజీవ్ రహదారి మీదుగా అయినాపూర్- తిమ్మారెడ్డిపల్లి శివారు, కొండపాక-కొమురవెల్లి శివారు మీదుగా దారి ఉన్నది. ఎక్కువశాతం కొండపాక స్వాగత తోరణం నుంచి భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. సిద్దిపేట వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు నిలుపుతుండటంతో పాటు పక్కనే చిన్నపాటి షెల్టర్, దుకాణాలు ఉండటంతో భక్తులకు కాస్త నీడ లభిస్తున్నది. కానీ సిద్దిపేట వైపునకు వెళ్లడానికి రోడ్డుకు అవతలి వైపున నిలబడుతూ ఇబ్బందులు పడుతున్నారు. షెల్టర్ నిర్మాణం చేయాలని యేటా బ్రహ్మోత్సవ సమీక్షా సమావేశాల్లో ప్రస్తావించడం, సంబంధిత అధికారులు పరిశీలిస్తామంటున్నారే తప్ప కార్యరూపం దాల్చడం లేదు. దీంతో పలుమార్లు భక్తులు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పుడిప్పుడే ఎండలు ప్రారంభమవడం, రానున్నరోజుల్లో మరింత దంచికొట్టనున్నందున భక్తులు మరిన్ని ఇక్కట్లు ఎదుర్కునే పరిస్థితి నెలకొన్నది. కాగా రూ.10.32 కోట్లతో కొండపాక స్వాగతతోరణం నుంచి మల్లన్న ఆలయం వరకు గల సింగిల్ లేన్ రోడ్డు డబుల్ లేన్‌గా చేపట్టిన విస్తరణ పనులు పూర్తి కావచ్చాయి. ఇదే చౌరస్తా నుంచి మల్లన్న రైల్వే స్టేషన్‌కు చేరుకోనుండటంతో రానున్న రోజుల్లో మరింత రద్దీ పెరగనున్నది. ఇప్పటికైనా ఆర్టీసీ, మల్లన్న ఆలయాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ వహించి రాజీవ్ రహదారికి అవతలి వైపున ప్రతీ ఆర్టీసీ బస్సు నిలపడంతో పాటు షెల్టర్ ఏర్పాటు చేయించాలని భక్తులు కోరుతున్నారు.



రాజీవ్ రహదారి పక్కన బస్సుల కోసం ఎండలో ఎదురుచూస్తున్న భక్తులు

విద్యార్థి వికాసంపై పుస్తకం రాసిన బాలుడు

- తాను చదువుతున్న పాఠశాలలో ఆవిష్కరణ

కొండపాక, మార్చి 2: తల్లిదండ్రుల ఆలోచనలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పదేళ్ల బాలుడు తోటి విద్యార్థులకు ఉపయోగపడే 'మూర్తిమత్వ వికాసం' పుస్తకాన్ని రాశాడు. దుద్దెడ గ్రామానికి చెందిన కోణం శిరీష-శ్రీకాంత్ దంపతుల కుమారుడు కోణం శ్రవణ్‌తేజ్ కేం బ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నాలుగవ తరగతి చదువుతున్నాడు. బేసిక్ లైఫ్ స్కిల్స్ పెంపొందించడంపై 'టెన్ బిఫోర్ టెన్' అనే పేరుతో పుస్తకం రాసి ఉపాధ్యాయుల నుంచి ప్రశంసలు పొందుతున్నాడు. శనివారం పుస్తకాన్ని ఉపాధ్యాయుల చేతులమీదుగా ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మేలు చేకూర్చాలనే సంకల్పంతో బుక్ రాసినట్లు శ్రవణ్‌తేజ్ తెలిపారు. 10 ఏళ్లలోపు విద్యార్థులు విద్యాభివృద్ధికి నేర్చుకోవాల్సిన 10 అంశాలను క్రోడీకరించి పుస్తకం రాసినట్లు పేర్కొన్నారు. తోటి విద్యార్థుల పురోభివృద్ధికి బుక్‌ను రూపొందించడం ప్రశంసనీయమని ఉపాధ్యాయులు అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి రూరల్, మార్చి 2: జిల్లాలోని కాలుష్య కారక పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) కార్యాలయంలో ఏవో శ్రావణ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమ వ్యర్థ జాలాలు, కలుషిత జలాలు నక్కవాగు ద్వారా మంజీరాలో చేరి, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆరోపించారు. పరిశ్రమలను తనిఖీ చేయని పీసీబీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం నాయకులు నర్సింలు, నర్సింహారెడ్డి, మహేష్ ఉన్నారు.



ఏవో శ్రావణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నాగులపల్లిలో హోరాహోరీగా కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

వట్‌పల్లి, మార్చి 2: మండల పరిధిలోని నాగులపల్లిలో సమ్మక్క-సారలమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆలయ నిర్వాహకుడు శంకరప్ప ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా.. కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ ప్రాంతం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలివచ్చారు. పలు విభాగాల్లో విజేతలుగా నిలిచిన మల్లయోధులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

స్కీముల పేరిట భారీ మోసం

- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కంది, మార్చి 2: స్కీముల పేరిట భారీ మోసం జరిగిన సంఘటన సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని కంది మండలంలో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఎస్టేట్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది జూన్‌లో హైదరాబాద్‌కు చెందిన ఓ ఆయుర్వేదిక్ కంపెనీలో రూ.లక్ష పెట్టుబడి పెడితే రూ.2 లక్షలు ఇస్తామని సదరు కంపెనీకి చెందిన కొందరు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు అదే ఎస్టేట్స్‌లో నివసిస్తున్న మరికొందరికి ప్రచారం చేశారు. అంతేకాకుండా రూ.లక్ష పెట్టుబడి పెట్టిన వారికి రోజుకు రూ.1350 చొప్పున 150 రోజుల పాటు, మరికొందరికి నెలకు రూ.29 వేల చొప్పున 7 నెలల పాటు చెల్లిస్తామని ఓ ఫేక్ సాఫ్ట్‌వేర్‌ను సృష్టించి మరీ నమ్మించారు. ఈ విషయం నమ్మిన 30 మందికి పైగా ఉద్యోగులు వెనకా ముందు ఆలోచించకుండా ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున వారు కంపెనీ సూచించిన అకౌంట్‌లో డిపాజిట్లు చేశారు. మొదట్లో వారు చెప్పిన విధంగానే కొందరికి చెల్లింపులు జరిగాయి. దాంతో ఈ స్కీమ్‌లో ఆయుర్వేదిక్‌తో పాటు రియల్ ఎస్టేట్స్, గోల్డ్‌స్కీమ్స్ ఉన్నాయని రంగురంగుల బ్రోచర్లు అచ్చు వేయించి సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. డబ్బులు చెప్పినట్టుగానే ఇస్తున్నారనే నమ్మకంతో తమతో పాటు కుటుంబసభ్యులను, స్నేహితులను, పరిచయస్తులను ఈ స్కీంలో చేర్పించారు. ఆ సంస్థ అనుకున్న దానికంటే ఎక్కువగా ప్రజలు డబ్బులు కట్టి మరీ స్కీంలో చేరడంతో అదును చూసిన సంస్థ బోర్డు తిప్పేసింది. లక్షల్లో నష్టపోయిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులతో పాటు కొందరు బాధితులు తమకు న్యాయం చేయాలని శనివారం కంది పరిధిలోని ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ విజయ్‌కుమార్ వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందిందని, పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

6న దుకాణాల నిర్వహణకు వేలం

కౌడిపల్లి, మార్చి 2: మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, అగరు బత్తిలు, బట్ట కవర్ల విక్రయ దుకాణాల నిర్వహణకు ఈ నెల 6 బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మోహన్ రెడ్డి తెలిపారు. గత నెల 20న నిర్వహించన వేలంపాటను అనివార్య కారణాలతో రద్దు చేసి, ఈ నెల 6న తిరిగి వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు, రూ.50 లక్షల నగదును నల్ల పోచమ్మ దేవస్థాన డ్రాఫ్టు రూపంలో నర్సాపూర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నందు చెలించాలని సూచించారు. గంట ముందు డిపాజిట్ చేసిన వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు. దేవదాయ శాఖ నిబంధనల మేరకు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, చెక్కు బుక్, ప్రభుత్వ ఉద్యోగి సంతకం తప్పని సరి అన్నారు.

మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే రోహిత్‌రావు

చిన్నశంకరంపేట, మార్చి 2: మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు జంగరాయి, మలుపల్లి, అంబాజీపేట, మడూర్ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే రోహిత్‌రావు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నశంకరంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాలు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. ఆరు గ్యారంటీలతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. గ్రామాల అభివృద్ధే తన లక్ష్యమని వెల్లడించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మడూర్, అంబాజీపేటలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మిగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచులు శ్రీమాన్‌రెడ్డి, రాజిరెడ్డి, రంగారావు, లక్ష్మీశంకరయ్య, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధిరాములు, ప్రధాన కార్యదర్శి మనోజ్, కాంగ్రెస్ మండల నాయకులు చిన్నరమేష్‌గౌడ్, ఎంపీడీవో దామోదర్, పీఆర్ఏఈ విజయ్, పంచాయతీ కార్యదర్శులు సంతోష్, భాను తదితరులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేటలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

రెండు మట్టి టిప్పర్ల పట్టివేత

తూప్రాన్, మార్చి 2: తూప్రాన్ మండలంలో అక్రమంగా అనుమతుల్లేకుండా మట్టి రవాణా చేస్తున్న రెండు మట్టి టిప్పర్లు శనివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు. నాగులపల్లి చౌరస్తా వద్ద ఏఎస్ఐ ఎం.లక్ష్మి మట్టి టిప్పర్లను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అంబేడ్కర్ సంఘం మండలాధ్యక్షుడిగా సురేష్

చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట మండల అంబేడ్కర్ సంఘం కమిటీని శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచంద్రం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గడ్డం సురేష్, ఉపాధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా పవన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భిక్షపతి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారికి జిల్లా అధ్యక్షుడు రాంచంద్రం నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మురళి, నర్సింహులు, శ్రీనివాస్, సుధాకర్, పాండు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిగా మద్దతివ్వండి

సంగారెడ్డి రూరల్: మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా తనకు మద్దతు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ నేత పి.ప్రభుగౌడ్ శనివారం పటాన్‌చెరు ఎమ్మెల్యేను కోరారు. పటాన్‌చెరులోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఎంపీ అభ్యర్థిగా అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు.

పాఠశాలకు వాటర్ ప్లాంటు

హత్నూర: మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి శనివారం బహూకరించారు. చార్ల మాణయ్య చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో తాజా మాజీ సర్పంచ్ చార్ల లక్ష్మీమాణయ్య వాటర్ ప్లాంటును అందజేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో చార్ల మణిదీప్, ఎస్ఎంసీ చైర్మన్ అదా శ్రీనివాస్, హెచ్ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

సంగారెడ్డి అర్బన్, మార్చి 2: ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను పరీక్షా కేంద్రానికి ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తెలిపారు. ఒక నిమిషం నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తారనే భావనతో ఉద్దేశ్యపూర్వకంగా ఎవరూ ఆలస్యంగా రాకూడదని స్పష్టం చేశారు. ఆలస్యంగా వచ్చినా సరైన కారణం ఉంటేనే అనుమతిస్తారని తెలిపారు. నిమిషం ఆలస్యం నిబంధన కారణంగా ఇంటర్ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, మార్చి 2: ఇంటర్ సెకండియర్ ఆంగ్లం పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాల్లో 16,827 మందికి 16,430 మంది విద్యార్థులు హాజరయ్యారు. 397 మంది గైర్హాజరయ్యారు. 97.64 హాజరు శాతం నమోదైంది. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాల, రాయల్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు.

'కేతకీ' ఆదాయం రూ.21.43లక్షలు

ఝరాసంగం, మార్చి 2: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారులు శనివారం లెక్కించారు. స్వామి వారికి భక్తులు మొక్కుల రూపంలో సమర్పించుకున్న 70 రోజుల హుండీ ఆదాయం రూ.21.43 లక్షలు వచ్చినట్లు ఆలయ అధికారి శశిధర్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రంగరావు పాల్గొన్నారు.

కొప్పోల్ జాతర ఏర్పాట్లపై సమావేశం



కొప్పోల్ ఆలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

పెద్దశంకరంపేట, మార్చి 2: మహాశివరాత్రి సందర్భంగా పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర ఆలయం వద్ద ఈ నెల 7నుంచి నిర్వహించే జాతరపై శనివారం కొప్పోల్ ఆలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సైకర్యాలను ఏర్పాటు చేయనునట్లు పేర్కొన్నారు. విధ శాఖల అధికారుల సమన్వయంతో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గిడ్డంగుల సంస్థ వ్యవస్థాపక దినోత్సవం

మెదక్ అర్బన్, మార్చి 2: కేంద్రం గిడ్డంగుల సంస్థ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం మెదక్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూఎస్ మేనేజర్ కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రైతులు, వ్యాపారులు, ప్రజలు సీడబ్ల్యూఎస్ గోదాముల్లో నిల్వ ఉంచి ఆర్థిక ప్రయోజనాలు పొందాలని పేర్కొన్నారు. ప్రస్తుతం 11,550 మెట్రిక్ టన్నుల నిల్వ చేసే సామర్థ్యం ఉండగా.. మరో 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నూతన గోదాముల నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీసీఐ రజిక్ హుస్సేన్, విశ్రాంత ఉద్యోగి రఘునాథ్, టెక్నికల్ ఇన్‌చార్జి శ్యాంకుమార్, విఠల్, జగదీష్ పాల్గొన్నారు.

భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయ చైర్మన్‌గా సుధాకర్ ప్రమాణస్వీకారం

పటాన్‌చెరు, మార్చి 2: బీరంగూడా భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా అమీన్‌పూర్ మాజీ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు బైస సుధాకర్‌యాదవ్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు పాలకమండలి సభ్యులు అరుణ, నిర్మల, గొల్ల మల్లేష్‌యాదవ్, ఆశగారి లక్ష్మణ్, లక్ష్మీకాంత్‌రావు, చంద్రశేఖర్, కుమ్మరిమహేష్, గోకం మహిపాల్ రెడ్డి, దీపక్‌గౌడ్, ఎల్వర్తి మల్లేష్‌యాదవ్, బొయిని పెద్దులు, జనుముల శ్రీనివాస్, కుంచం ఎల్లయ్య బాధ్యతలను స్వీకరించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి శశిధర్ నియామకపత్రాలను అందజేశారు. అనంతరం సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ.. శివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేస్తామన్నారు.

నేడు సింగురు చౌరస్తా వద్ద మంత్రి దామోదర్ కూతురు వివాహ విందు

పుల్‌కల్, మార్చి 2: మంత్రి దామోదర్ రాజనర్సింహ కూతురు త్రిష వివాహ విందును చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో సింగూరు చౌరస్తా వద్ద ఆదివారం నిర్వహించనున్నారు. 40 ఎకరాల విస్తీర్ణంలో వేడుకను నిర్వహించేందు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేడుకకు మంత్రులు, కాంగ్రెస్ నేతలు, నియోజకవర్గ ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నత్తి దశరత్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

బొల్లారం మున్సిపల్ వార్షిక బడ్జెట్ రూ.33 కోట్లు

● ఆమోదం తెలిపిన పాలక మండలి



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జిన్నారం, మార్చి 2: బొల్లారం మున్సిపాలిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన రూ.33కోట్ల అంచనా బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపింది. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. మున్సిపాలిటీలో నూతన ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి, ఇతర కార్యక్రమాల కోసం రూ.33కోట్లతో చేపట్టనున్న ప్రణాళికకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లు, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు చంద్రారెడ్డి, గోపాలమ్మ, నిహారిక, సంతోష, మున్సిపల్ కమిషనర్ మంగతాయారు, ఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి తదితరులు సన్మానించారు.

మోదీ సభకు తరలివచ్చి జయప్రదం చేయండి

● పిలుపునిచ్చిన బీజేపీ నాయకులు



సంగారెడ్డిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్/అల్లాదుర్గం, మార్చి 2: ఈ నెల 5న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని ఎల్లంకి కళాశాల మైదానంలో నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు ప్రజలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజుగౌడ్ మాట్లాడారు. మెదక్ జిల్లా అల్లాదుర్గంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.ప్రభాకర్‌గౌడ్, అందోల్ నియోజకవర్గ కో కన్వీనర్ కాశ రాములు మాట్లాడారు. సభకు మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వాసు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సురేందర్, జిల్లా కార్యదర్శి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అశ్వంత్ పాల్గొన్నారు. అల్లాదుర్గంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు నీలి రమేష్, ఆయా గ్రామాల అధ్యక్షులు కిష్టయ్య, గోపాల్, సంగమేశ్వర్, సాయిలుగౌడ్ పాల్గొన్నారు.

పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలి

● రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యాదగౌడ్

వెల్దుర్తి, మార్చి 2: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు యాదగౌడ్ కోరారు. శనివారం తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు పిలుపు మేరకు వెల్దుర్తిలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్యతో కలిసి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నదన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధి పాటుపడుతామని పార్టీలు తమ మేనిఫెస్టోలో ప్రకటించాలన్నారు. పంటలకు బీమా పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ పంట నష్టం జరిగిన 30రోజుల్లోనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి షూరిటీ లేకుండా రూ.ఐదు లక్షల వరకు తక్కువ వడ్డీకి రుణసౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా కోశాధికారి వెంకటేశం పాల్గొన్నారు.



వెల్దుర్తిలో మాట్లాడుతున్న యాదగౌడ్

'పెండింగ్ బిల్లులను చెల్లించండి'

పుల్‌కల్, మార్చి 2: గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని తాజా మాజీ సర్పంచులు జిల్లా పంచాయతీ అధికారిని కోరారు. శనివారం పలువురు సర్పంచులు జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబను కలిసి విన్నవించారు. అనంతరం ఆయనను సన్మానించారు. పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణ, ఇతర కార్యక్రమాలకు వెచ్చించిన డబ్బులు రావాల్సి ఉన్నదని వివరించారు. డీపీవోను కలిసిన వారిలో బక్కారెడ్డి కిష్టారెడ్డి, బుర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పట్లోళ్ల నర్సింహ్మారెడ్డి, బాబిరెడ్డి అరవింద్‌రెడ్డి, గడి పెద్దాపూర్ ఎంపీటీసీ విఠల్‌రెడ్డి, అల్వాల నర్సింహులు ఉన్నారు.

మెదక్ ఆర్డీవోగా రమాదేవి



మెదక్ అర్బన్, మార్చి 2: మెదక్ ఆర్డీవోగా రమాదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన అంబదాస్ రాజేశ్వర్‌ను ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేయగా.. ఆయన స్థానంలో భూపాలపల్లి డిప్యూటీ కలెక్టర్ రమాదేవిని నియమించారు. ఈ మేరకు శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

సంగారెడ్డి అర్బన్, మార్చి 2: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష జరగనున్నది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 6,7,8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష జరగనున్నది. సంగారెడ్డి జిల్లాలో 14 కేంద్రాల్లో 3,391 మంది, మెదక్ జిల్లాలో 10 కేంద్రాల్లో 2,326 మంది, సిద్దిపేట జిల్లాలో ఆరు కేంద్రాల్లో 1,480 మంది పరీక్ష రాయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల్లో 7,197 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఇందులో బాలురు 4,249 మంది, బాలికలు 2,948 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగే ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉమ్మడి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ ప్రభాకర్ తెలిపారు.

ఆస్తిపన్నుపై 90శాతం వడ్డీ మాఫీ

నర్సాపూర్, ఫిబ్రవరి 2: నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో ఆస్తిపన్ను బకాయి ఉన్న వారికి ప్రభుత్వం వడ్డీపై 90శాతం మాఫీ ప్రకటించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జైతురాంనాయక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బకాయి ఉన్న ఆస్తి పన్నులపై 90శాతం వడ్డీ మాఫీ పొంది పది శాతం వడ్డీ మాత్రమే చెల్లించాలని సూచించారు. ఈ అవకాశం ఈ నెల 31వరకు ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

చేగుంట, మార్చి 2: నార్సింగ్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కుల సంఘాల నాయకులు శనివారం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ యెన్నం రాజేందర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సిద్ధు, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ ఎండీ బాబర్‌పాషా, పీఏసీఎస్ డైరెక్టర్ గుర్రాల స్వామి, వార్డు మాజీ సభ్యురాలు పోచమ్మ, వంజరి సంఘం మాజీ అధ్యక్షుడు ఎం.కె.రాజు, శంకర్, సంపత్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, మండల యూత్ అధ్యక్షుడు స్వామి బాబి, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఫిషర్‌మెన్ అధ్యక్షుడు సుధాకర్, మైనారిటీ నాయకుడు జహీర్ తదితరులు పాల్గొన్నారు. కాగా చేగుంటకు చెందిన బీజేపీ నేత తీగల భూమలింగంగౌడ్ హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

శ్రీపాదరావు జయంతి

మెదక్ అర్బన్, మార్చి 2: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం కలెక్టరేట్‌లో స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీపాదరావు నిజాయితీ, నిరాడంబరత ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఏవోయూనస్, వివిధ శాఖల జిల్లా అధికారులు విజయలక్ష్మి, చిన్నసాయిలు, నాగరాజు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శ్రీపాదరావు జయంతిని ఎస్పీ బాలస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

బొల్లారంలో సీసీ కెమెరాల ప్రారంభం

జిన్నారం, మార్చి 2: బొల్లారం మున్సిపాలిటీలోని వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ప్రారంభించారు. బీజేపీ నాయకుడు ఆనందకృష్ణారెడ్డి రూ.లక్షా20వేలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించగా మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 2: మండల పరిధిలోని అంతర్గాం ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే ఎన్నికల అధికారులుగా, పోటీదారులుగా, సిబ్బందిగా, రాజకీయ పార్టీల ఏజెంట్లుగా, ఓటర్లుగా వ్యవహరించారు. 30 విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు శివకుమార్, భరత్ పోలింగ్ విధానాన్ని వివరించారు.

బీజేపీ మళ్లీ వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లు రద్దు

● కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

సంగారెడ్డి రూరల్, మార్చి 2: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లు రద్దు చేయడం ఖాయమని కుల వివక్ష పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం నిర్వహించిన కేవీపీఎస్ జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ, కులాల మధ్య కుంపటి రాజేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నదని విమర్శించారు. పదేళ్ల అధికారులంలో ఉన్న బీజేపీ దళితుల కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితులపై దాడులు పెరిగాయని ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న మోదీ పదేళ్లలో కనీసం రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేని అసమర్థ ప్రధాని అని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను పడగొట్టిన చరిత్ర బీజేపీకే ఉన్నదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం మాట్లాడుతూ.. మార్చి, ఏప్రిల్ నెలలను మహనీయుల మాసాలుగా గౌరవిస్తూ పూలే, అంబేడ్కర్ జన జాతరలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా జిల్లా సదస్సులు నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో ఆఫీస్ బేరర్స్ న్యాయవాది సుభాష్, మద్దూరి శివకుమార్, ప్రవీణ్, సంతోష్‌దాస్, మల్లేశ్ పాల్గొన్నారు.



సంగారెడ్డిలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

సదాశివపేట మార్కెట్ కమిటీ పాలకవర్గం ఖరారు

సదాశివపేట, మార్చి 2: సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఖరారైంది. చైర్మన్‌గా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన సదాకుల కుమార్, వైస్ చైర్మన్‌గా సదాశివపేట పట్టణానికి చెందిన కంది కృష్ణగుప్తాలు నియామకమయ్యారు. సభ్యులు(డైరెక్టర్లు)గా గడీల నరేందర్‌గౌడ్, చిరంజీవి (చిరు), విశ్వనాథ్ కలావతి, ప్రశాంత్‌గౌడ్, బోవన్‌సోమ్లా, పి.శివకుమార్, సయ్యద్ యూసూఫ్, మధుకర్‌రెడ్డి, శైలేందర్, కె.శేఖర్, కె.లక్ష్మణ్‌కుమార్, కె.రమేష్, ఎం.మాణిక్‌రెడ్డి నియామకమయ్యారు.

పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి



ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

జహీరాబాద్, మార్చి 2: పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు ఎన్నికల విధులు నిర్వర్తించినందుకు డబ్బులను చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మహిపాల్ కోరారు. ఈ మేరకు శనివారం జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. రెండునెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో కార్మికులకు కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారుతుందన్నారు. ఎన్నికల సమయంలో పనిచేసిన పారిశుధ్య కార్మికులకు డబ్బులు ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. అనంతరం ఆర్డీవో రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఏడుపాయల విధులను బహిష్కరిస్తాం

మనోహరాబాద్: గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ డిమాండ్ చేశారు. ఈ నెల 5లోగా వేతనాలు చెల్లించకుంటే ఏడుపాయల విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. అనంతరం మనోహరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారి కృష్ణమూర్తికి వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో వీరేష్, రాములు, ఆంజనేయులు, శ్రీకాంత్, సత్యనారాయణ, బాలమణి, ఎల్లమ్మ, నవనీత, పుష్ప ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కంది, మార్చి 2: మండలంలోని చేర్యాల శివారులో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పోలీసులకు లభ్యమైంది. ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని శవ పంచనామా నిర్వహించి, సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు అంచానా వేస్తున్నారు.

ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి అర్బన్, మార్చి 2: నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు కార్మికుల ఆత్మహత్యకు కారణమైన ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట శనివారం కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని ప్రశ్నించినందుకు ముగ్గురు కార్మికులను తొలగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాంట్రాక్టు ఏజెన్సీ వ్యవస్థలపై పునఃసమీక్షించాలని కోరారు. నల్లగొండ ఆస్పత్రిలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో కంకోల్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

మునిపల్లి, మార్చి 3: మండలంలోని కంకోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. నాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి: డీపీవో

పాపన్నపేట, మార్చి 2: వేసవి కాలం సమీపిస్తున్నందున ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను డీపీవో యాదయ్య ఆదేశించారు. శనివారం మండల కేంద్రమైన పాపన్నపేటను సందర్శించి, గ్రామపంచాయతీకి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వనన ర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నయీం ఉన్నారు.

ఉపాధిహామీ పనులను పరిశీలించిన అధికారులు

ఝరాసంగం, మార్చి 2: మండల పరిధిలోని ప్యాలవరం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీడీవో సుధాకర్, ఏపీవో రాజ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో 1,980 మంది కూలీలు ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్నారని చెప్పారు. 100 రోజుల పనిదినాలు పూర్తయిన కూలీల సంఖ్య అధికంగా ఉన్నదన్నారు.

భ్రమరాంబ, మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం

సదాశివపేట, మార్చి 2: మండలంలోని ఆత్మాకూర్ గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ 50వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం భ్రమరాంబ, మల్లికార్జునస్వామిల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేక రథంపై ఊరేగించారు. అర్ధరాత్రి వరకు కొనసాగిన కల్యాణ మహోత్సవంలో పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో రైతుబంధు అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, తాజా మాజీ సర్పంచ్ ఇందూరి గంగన్న పాల్గొన్నారు.

పోతన్‌పల్లిలో

నారాయణఖేడ్: ఖేడ్ మండలం పోతన్‌పల్లిలో నిర్మించిన శివాలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. వేదపండితులు, పురోహితుల ఆధ్వర్యంలో హోమంతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అంతర్గాం పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతి మహరాజ్ పాల్గొని భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల స్వయం పాలన

చిన్నశంకరంపేట/శివ్వంపేట, మార్చి 2: చిన్నశంకరంపేట మండలంలోని టీ మాందాపూర్ పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రవిందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఫణీంద్రచారి, ఉపాధ్యాయులు అనిత, రామలింగం, రాజశేఖర్, మంజుల, సంతోషి పాల్గొన్నారు. శివ్వంపేట మండలం దంతాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డీఈవోగా గిరి, హెచ్ఎంగా హేమంత్, ఉపాధ్యాయులుగా ఐశ్వర్య, మానస, తనీష్ వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయురాలు కవిత, తాజా మాజీ సర్పంచ్ దుర్గేష్, ఉప సర్పంచ్ నాగేశ్వరావు బహుమతులు అందజేశారు.

కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సంతోష్

నారాయణఖేడ్, మార్చి 2: కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగల్‌గిద్ద మండలం మోర్గికి చెందిన సంతోష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శిగా కంగ్టికి చెందిన దాస్‌ను నియమించినట్లు వారు తెలిపారు.